# గిరిజన భూములపై రేవంతరెడ్డి కన్ను



రాచకొండ భూములు మీ అయ్య జాగీరా..

అధికారంలోకి రాకముందే మాస్టర్‌ప్లాన్

**50వేల ఎకరాల రైతుల భూములపై కాంగ్రెస్ గద్దల కన్ను**

- రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమన్న రాచకొండ వాసులు
- సెంట్ భూమి కూడా ఇచ్చేది లేదు..
- మా పొలాల జోలికొస్తే తరిమి కొడతాం
- ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తామని శపథం
- అమరావతి తరహాలో కొత్తసిటీ నిర్మిస్తామని సాకులు
- మరో ఉద్యమానికి సిద్ధమంటున్న రైతులు



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి పిల్ల పుట్టకముందే.. కుల్ల కుట్టినట్లు ఉంది.. అధికారం ఇస్తే రంగారెడ్డి-నల్గొండ జిల్లాల సరిహద్దులోని రాచకొండ ప్రాంతంలో 50వేల ఎకరాలను కొల్లగొట్టేందుకు మాస్టర్‌ప్లాన్ వేసింది. ల్యాండ్‌పూలింగ్ తరహాలో భూములను సేకరించి.. ఆ భూములను వివిధ కంపెనీలకు విక్రయించేందుకు కుట్రలు పన్నుతున్నది. వచ్చే డబ్బులతో ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు స్వయంగా ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆకారమే లేని అమరావతిని ఆదర్శంగా తీసుకుంటామనే రేవంత్ వ్యాఖ్యలపై రాచకొండ వాసులు భగ్గుమంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే ఇలాంటి కుట్రలకు తెరలేపటంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతంలోనే రాచకొండ ప్రాంతం పరిసర ప్రాంతాల్లో ఫీల్డ్‌ఫైరింగ్ రేంజ్‌ను ఏర్పాటు చేయాలని అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధంచేయగా.. నల్గొండ జిల్లాలోని నారాయణపురం, అల్లాపురం, అల్లాపురం తండా, తుంబాయితండా, ఐదోనలతండా, రాచకొండతండా, రంగారెడ్డిజిల్లాలోని తిప్పాయిగూడ, పటేల్‌చెర్వుతండా, కడీలబావితండా, ఆరుట్ల తదితర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సర్వేకోసం వచ్చిన అధికారులపై కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో పాటు పెట్రోల్‌పోసి తగులబెట్టే ప్రయత్నం చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఫీల్డ్ ఫైరింగ్‌రేంజ్ ప్రతిపాదనలు ఉపసంహరించుకుంది. ఈ పరిస్థితిలో మరోమారు కాంగ్రెస్ నాయకులు ఈ భూములపై కన్నేయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారంలోకి రాక ముందే రేవంత్‌రెడ్డి రైతులకు వ్యతిరేకంగా కుట్రలకు తెరదీస్తున్నారని, ఇక ప్రభుత్వంలో ఉంటే ఇంకెంత కుయుక్తులు చేస్తారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడగొడతామని శపథం చేస్తున్నారు. ఫైరింగ్ రేంజ్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరోమారు కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడుతామని హెచ్చరిస్తున్నారు.

- ఇబ్రహీంపట్నం/ యాదాద్రి భువనగిరి, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ)



### భూములు లాక్కుంటే ఊరుకోం

మా భూములు లాక్కుంటే ఊరుకునేది లేదు. మీ పార్టీ గొప్పలకు పోయి గ్యారంటీలు ఇచ్చుడేంది. తర్వాత మా భుములను అమ్మి హామీలు చేస్తాననడం ఏంది. తాతల తరాల నుంచి వాటినే నమ్ము కొని ఉన్నాం. మాకు జీవనాధారమే ఈ భూములు. ఈ భూముల్లో బర్రెలు, గొర్రెలను మేపుకోవడమే కాకుండా పంటలు కూడా పండించుకుంటున్నం. అలాంటి భూములను తీసుకుంటామంటే ఎంతటి వరకైనా సిద్ధమే.

- కరంటోతు భాస్కర్‌నాయక్, ఎనగండితండా, చౌటుప్పల్



### మేము భూములు ఇవ్వము

మా నాన్నకు మాతాత, నాకు మా నాన్న వారసత్వంగా భూములను సాగుచేసుకుంటూ బతుకుతున్నాం. భూములుంటేనే మా పిల్లలు, మా పిల్లల పిల్లలకు వారసత్వంగా ఆస్తిని అందించిన వారమవుతాం. కానీ, ఎవరో వచ్చి భూములు తీసుకుని డబ్బులిస్తామంటే, మేము భూములు ఇవ్వము. భూములుంటేనే చూసుకుని ధైర్యంగా బతుకొచ్చు. పైలసిస్తే అవేమీ చేయాలో మాకు తెలియదు. మా భూముల జోలికె వరొచ్చినా ఊరుకోం.

- మెగావత్ గన్నా, తిప్పాయిగూడ



### రేవంత్‌రెడ్డికి పిచ్చి పట్టింది

రాచకొండ ప్రాంతంలోని 50 వేల ఎకరాల భూములను అమ్మి గ్యారంటీ పథకాలకు డబ్బులు సమకూరుస్తామన్న కాంగ్రెస్ పార్టీని ఓడగొడుతం. రేవంత్‌రెడ్డికి పిచ్చి పట్టి మాట్లాడుతున్నడు. రైతులన్నా, వ్యవసాయమన్నా ఆయనకు గౌరవం లేదు. రైతు క్షేమం కోసం ఆలోచించే సీఎం కేసీఆర్‌ను చూసి కాంగ్రెసోళ్లు నేర్చుకోవాలి. రేవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తగులతది. చేతగాని హామీలు ఇవ్వొద్దు.. భూముల జోలికి రావద్దు. రాచకొండ రైతులమంతా కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతాం.

- వీరమల్ల రాజుగౌడ్, అంతంపేట ఉప సర్పంచ్, మర్రిగూడ

### కాంగ్రెస్ అంటేనే బూటకం



కాంగ్రెస్ పార్టీని నేడు ఎవరు నమ్మే పరిస్థితి లేదు. కాంగ్రెస్ అంటేనే ఓ బూటకం. అందులో ఉన్న నాయకుడు అధికారంలోకి రాకముందే రాచకొండ భూములను కంపెనీలకు అమ్ముకుంటామని చెబుతుంటే సిగ్గుగా ఉంది. పిల్ల పుట్టముందుకే.. కుల్లకుట్టినట్లుగా రేవంత్‌రెడ్డి మాటలున్నాయి. రాచకొండ భూముల జోలికి గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఫీల్డ్ ఫైరింగ్ పేరుతో భూములు గుంజుకోవటానికి వస్తేనే గిరిజన రైతులంతా ఏకమై తరిమికొట్టడంతో మళ్లీ ఇక్కడకు ఏ ఒక్కడు రాలేదు. ఇప్పుడు ఎవరైనా వస్తే వారికి మరోసారి బుద్ధి చెప్పక తప్పదు.

- రాజునాయక్, పటేల్‌చెర్వుతండా

### మా భూములు తీసుకోవటం ఎవరితరమూ కాదు



ఉదయం లేచినప్పటి నుంచి భూమిలో పంటలు సాగుచేసుకుంటేనే మా జీవనం సాగుతుంది. ఈ భూమిని నమ్ముకునే మా కుటుంబాలు జీవిస్తున్నాయి. అలాంటి బంగారంలాంటి భూములను ఎవరో వచ్చి గద్దల్లా తన్నుకుపోతామంటే చూస్తూ ఎలా ఊరుకుంటాం. మేము భూమిని నమ్ముకున్నాం. మాకు అన్నంపెట్టే భూమిని గుంజుకోవాలని చూస్తే ఊరుకోం.

- జర్పుల లక్ష్మి , కడీలబావితండా



### తరిమి కొడుతాం

ఎన్నో ఏండ్లుగా వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్నం. సీఎం కేసీఆర్ ఇస్తున్న రైతుబంధు పుణ్యమా అని పెట్టుబడి బాధ తప్పింది. రాచకొండ ప్రాంతంలో 50 వేల ఎకరాల భూమిని సేకరించి వాటిని బడా కంపెనీలకు అమ్ముతానని రేవంత్‌రెడ్డి అనడం ఆశ్చర్యమేసింది. ఆ భూములను అమ్మి కాంగ్రెస్ పథకాలకు ఖర్చు పెట్టడమేంటి. మా భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోం. రేవంత్‌రెడ్డిని తరిమి కొడుతాం. కాంగ్రెసోళ్లకు చేతకాకపోతే గ్యారంటీ పథకాల గురించి మాట్లాడొద్దు.

- నేనావత్ బంతిలాల్, అంతంపేట ఎంపీటీసీ, మర్రిగూడ



### బెదిరింపులకు భయపడం

ముఖ్యమంత్రి కేసీఆర్ మా గిరిజన తండాల ప్రజలు పడుతున్న గోసలను అర్థం చేసుకుని పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను అందించి అండగా నిలబడ్డారు. మా భూములు గుంజుకుని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తున్న రేవంత్ రెడ్డి బెదిరింపులకు భయపడం. రాచకొండ ప్రాంతంలో అడుగు పెడితే తరిమి కొడుతాం. అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకోం.

- పానుగోతు పాండునాయక్, సర్పంచ్, వెంకంబావితండా, సంస్థాన్‌నారాయణపురం



### మేము చేతులు మడుచుకుని కూసోము

మా భూముల జోలికి ఏ దార్థాడు వచ్చినా ఉరికించి కొడతాం. మా భూములను ఎన్నో ఏళ్లుగా పంటలు సాగుచేసుకుంటూ బంగారంగా చూసుకుంటున్నాం. ఎవరెవరో వచ్చి ఓసారి ఫీల్డ్‌ఫైరింగ్ పెడతామంటేనే ఉరికించి కొట్టాం. మల్లా ఇంకోగాయన వచ్చి రాచకొండ భూములను కంపెనీలను ఇస్తామంటే మేము చేతులు మడుచుకుని కూసోము. ఎవరైనా మా భూముల దగ్గరకు రావాలంటే ముందు మమ్ములన్ని ఎదుర్కోవాలి.

- ఒగ్గు కిష్టయ్య, రాచకొండతండా

### ప్రాణం పోయినా భూములు వదులుకోం




మా తాతలు, మా అయ్యలు ఎంతో కష్టపడి సంపాదించిన భూములను మా ప్రాణంపోయినా వదులుకోం. ఎవరో వచ్చి మా భూములను ఎంతోఅంత ఇచ్చి తీసుకుంటామంటే ఒప్పుకోం. మాకు అన్నంపెట్టే భూముల జోలికొస్తే ఎంతటివారినైనా తరిమికొడతాం.

- ధర్మానాయక్, పటేల్‌చెర్వుతండా



# తెలంగాణ.. అప్పుడెట్లుండే.. ఇప్పుడెట్లుంది..?



కామారెడ్డి సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

**ప్రజలు ఆలోచన చేయాలి.. సరైనోళ్లను ఎన్నుకోవాలి**



- ఉన్న తెలంగాణను ఊడగొట్టి.. 58 ఏండ్లు గోసపెట్టింది కాంగ్రెస్ పార్టీ కాదా..?
- మళ్లీ ఇప్పుడొచ్చి కరెంటు, రైతు బంధు పీకేయ్యాలంటరు
- బీజేపోళ్లు.. మోటార్లకు మీటర్లు పెట్టాలంటరు
- రాజకీయ అస్థిరత తేవాలని కుట్రపన్ని.. 50లక్షల నగదుతో దొరికిన దొంగ రేవంత్
- రాహుల్‌గాంధీకి ఎద్దెరుకనా..? ఎవుసమెరుకనా..?
- భూ యాజమాన్యం మారాలంటే.. రైతు బొటనవేలుతోనే సాధ్యం
- ధరణి ఎత్తేస్తే రైతుబంధు, వడ్ల పైసలు ఎట్ల పడుతయ్
- కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి ఆగం కావొద్దు.. దళారీ వ్యవస్థ వస్తది

తొమ్మిదేండ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి.. మరోమారు ఆశీర్వదిస్తే.. బంగారు తునకగా మార్చుకుందాం

**కామారెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్**

"బీజేపీ నాయకులేమో మోటార్లకు మీటర్లు పెట్టాలని అంటుంటే.. కాంగ్రెస్ నాయకులేమో కరెంటు వద్దు, రైతు బంధు వద్దు అంటున్నారు.. వాళ్ల మాటలు నమ్మి తెలంగాణ ప్రజలు ఆగం కావద్దు" అని సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం కామారెడ్డిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. "తెలంగాణ రాకముందు వలసలు పోవుడు.. బతుక పోవుడు. చెట్టుకొకలు.. పుట్టకొకలు ఆగమాగం అయినం. ఇయ్యాళ కాపాడుకోవాలి.. నిలబెట్టుకోవాలని ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కాల్వలకు నీళ్లు ఇచ్చినం. నీళ్లకు ట్యాక్స్ రద్దు చేసినం. పాత బకాయిలు మాఫీ చేసినం. 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నం. ఎంత కరెంటు వాడుతున్నవ్.. ఎన్ని మోటార్లు పెడుతున్నవ్ అని అడుగొద్దు.. రైతులను ఇబ్బంది పెట్టొద్దని కరెంటోళ్లకు చెప్పినం. రైతుబంధు ఇస్తున్నాం.. రైతు బీమా ఇస్తున్నాం. ఏ ఊరి పంటను ఆ ఊరిలోనే కొంటున్నాం. రైతాంగాన్ని నిలబెట్టుకోవాలి. వ్యవసాయాన్ని స్థిరీకరించాలనే పద్ధతితో ముందుకుపోతున్నం. మూడుకోట్ల మందికి కంటి పరీక్షలు చేసి.. 80 లక్షల మందికి కంటి అద్దాలు ఇచ్చినం.. ఈ పని చరిత్రలో ఏ ప్రభుత్వమైనా చేసిందా..? వైద్య, విద్య, వ్యవసాయం ఏ రంగమైనా కావచ్చు బ్రహ్మాండంగా అభివృద్ధి చేశాం. అనేక సంక్షేమ కార్యక్రమాలతో అన్ని వృత్తుల వాళ్లను ఆదుకుంటున్నాం. తెలంగాణ రాకముందు మన గతి ఎట్లుండే.. ఇప్పుడెట్లుంది. ఓటేసే ముందు ఏ ప్రభుత్వం ఏర్పడితే మంచిదో ఆలోచన చేయాలి. కామారెడ్డికి కేసీఆర్ ఒక్కడు రాడు.. కేసీఆర్ వెంబడి చాలా వస్తయి. కామారెడ్డిని బంగారు తునకలా తయారు చేసి మీకు అప్పగిస్తా.. అందుకు మీ సహకారం కావాలి. అని కేసీఆర్ అన్నారు.

### కాంగ్రెసోళ్లను బంగాళాఖాతంలో పడేయాలి

ధరణి రాకముందు రైతుల భూమి రిజిస్టర్ చేయాలంటే వీఆర్వో, గిర్దావరి, తాసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, ఆయన మీద సెక్రటరీ, సీసీఎల్‌ఏ, రెవెన్యూ మంత్రి ఉండేటోళ్లు. ఇండ్ల ఎవరికి కోపం వచ్చినా.. కైలాసంలో ఆటల పెద్దపాము మింగినట్టే.. భూమి గోవిందా.. ఎల్లయ్య భూమి పుల్లయ్యకు.. పుల్లయ్య భూమి ఎల్లయ్యకు రాసి.. జుట్లు ముడేసి.. తాకట్లు పెట్టి.. ఆఫీసుల చుట్టు తింపి.. వేలు, లక్షలు గుంజింద్రు. రైతులను నాశనం పట్టిచ్చింద్రు. వీరి ఆగడాలకు చెక్ పెట్టేందుకే ధరణి పోర్టల్ తెచ్చినం. ప్రభుత్వం వద్ద ఉన్న అధికారాలను రైతుల బొటనవేలుకు అప్పగించినం. భూ యాజమాన్యం మారాలంటే.. రైతు బొటనవేలుతోనే సాధ్యం. అలాంటి ధరణి తీసేస్తే.. రైతుబంధు, రైతు బీమా ఎట్ల వస్తది..? వడ్లు కొన్న పైసలు ఎట్ల వస్తయి.. పాత గిర్దావరిలు, వీఆర్వోలు వస్తరు. మళ్లా రైతుల పరిస్థితి మొదటికి వస్తది. ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తామని అనేటోళ్లను బంగాళాఖాతంలో వేయాలి.



"రాహుల్‌గాంధీకి ఎద్దెరుకనా..? ఎవుసం ఎరుకనా..? ఏనాడైనా నాగలి పట్టిండా..? వచ్చిన తెలంగాణను విచ్ఛిన్నం చేయడానికి, తెలంగాణలో రాజకీయ అస్థిరత తేవాలని ఎవడైతే ఎమ్మెల్యేలను కొనడానికి వచ్చి 50 లక్షల నగదుతో పట్టుబడ్డడో.. ఆ మహాత్ముడే కామారెడ్డిల నామీద పోటీకొస్తడంట.. కామారెడ్డి ప్రజలు ఆలోచన చేయాలి. రైతు బంధు, రైతు బీమా, ధరణి, 24 గంటల కరెంటు వద్దు అనేటోళ్లు కావాల్నా.. ప్రజల్ని కడుపులో పెట్టుకుని చూసేటోళ్లు కావాల్నా..?"



"కాంగ్రెస్ పార్టీ తెలంగాణకోసం ఏం చేసింది.? ఉన్న తెలంగాణను ఊడగొట్టి 58 ఏండ్లు గోసపెట్టింది. వందలాది మంది విద్యార్థుల చావులకు, కరువు కాటకాలు, రైతుల ఆత్మహత్యలకు కారణం కాంగ్రెస్ పార్టీ కాదా..? వారి పాలనలో ప్రాజెక్టులు కట్టింద్రా..? నీళ్లు ఇచ్చింద్రా..? ఉద్యోగాలు ఇచ్చింద్రా..? కరెంటు ఇచ్చింద్రా..? ఆ పార్టీకి ప్రజల ఓట్లు కావాలే. కానీ ప్రజల బాగోగులు పట్టవు. అందుకే గుడ్డిగా ఓటెయ్యొద్దని కోరుతున్నా. ఆలోచించి ప్రజల బాగు కోరే పార్టీకి ఓటేస్తే వచ్చే ఐదేళ్లు మేలు జరుగుతది." అని సీఎం కేసీఆర్ అన్నారు.

